క్లుప్తంగా

శాస్త్రోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత మన బాధ్యత



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చెత్తను తొలగిస్తున్న తహసీల్దారు శ్రీదేవి

బుచ్చినాయుడుకండ్రిగ: పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దారు శ్రీదేవి తెలిపారు. శనివారం ఆమె స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా తహసీల్దారు కార్యాలయం ఆవరణలో చెత్తా చెదారాన్ని సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి ఆవరణ, పరిసరాలతో పాటు విధులను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. స్వచ్ఛతతోనే వ్యాధులు దూరమవుతాయన్నారు. గ్రామాల్లోని వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, వీఆర్ఓలు పాల్గొన్నారు.

విలీన ప్రక్రియను అడ్డుకుంటాం



జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

తిరుపతి సిటీ: గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియను అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్సిటీల కో–కన్వీనర్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఎస్వీయూ ప్రకాశం భవన్ ఎదుట ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వ వైఖరి కారణంగా పేద విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమయ్యే ప్రమాదముందన్నారు. విలీన నిర్ణయం ఉపసంహరించుకోకుంటే పోరాటం తప్పదని స్పష్టం చేశారు. అలాగే నిరుద్యోగులకు భృతి హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు నరసన్న, వినోద్, తిరుమలేష్, భాను, శ్రీకాంత్, ఆకాష్, భాస్కర్, మాతేశ్వరి పాల్గొన్నారు.


వేతన బకాయిల కోసం ఆందోళన



ధర్నాకు దిగిన కార్మికులు, నేతలు

తిరుపతి తుడా: రుయా, మెడికల్ కాలేజీ, మెటర్నిటీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 3 నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు మెటర్నిటీ ఆస్పత్రి వద్ద కార్మికులతో కలసి ఆందోళనకు దిగారు. ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఏ వన్ కాంట్రాక్టర్ 3 నెలలుగా జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఆరోపించారు. అలాగే మూడేళ్లగా పీఎఫ్ నగదును కూడా కార్మికుల ఖాతాల్లో జమ చేయకుండా దుర్వినియోగం చేస్తున్నాడని మండిపడ్డారు. దీనిపై పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు ఎన్డీ రవి, మహేంద్ర, కేవై రాజా పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయ ఏవీఎస్ఓగా రాధాకృష్ణ



చంద్రగిరి: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయ ఏవీఎస్ఓగా రాధాకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ఇంటలిజెన్స్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఆలయం వద్ద ఏవీఎస్ఓ రాధాకృష్ణకు అధికారులు స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వాద మండపంలో బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఆలయ అధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

- ప్రభుత్వ స్కూళ్లలో ఆగిన నాడు–నేడు పనులు
- అసంపూర్తిగా దర్శనమిస్తున్న భవనాలు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- కూటమి ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి



వెనుకబడి..



వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురం హైస్కూల్‌లో చివరి దశలో పనులు నిలిచిన అదనపు గదులు, (ఇన్‌సెట్) సత్యవేడు మండలం

మాదనపాళెం హైస్కూల్‌లో ఆగిపోయిన డైనింగ్ హాల్ భవనం

వరదయ్యపాళెం: దేశ భవిష్యత్‌కు పునాది పడే ప్రభుత్వ పాఠశాలలు కునారిల్లుతున్నాయి. అందుకు ఈ చిత్రాలే సజీవ సాక్ష్యం. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో పలు ప్రభుత్వ పాఠశాలల దుస్థితిలో ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మన బడి, నాడు–నేడు కార్యక్రమం చేపట్టక ముందు స్కూళ్ల తీరు మరీ దారుణం. తలుపులు లేని గదులు, విరిగిన కిటికీలు, రంగు వెలసిన బోర్డులు, విరిగిన బెంచీలు దర్శనమిచ్చేవి. వాటిని గత ప్రభుత్వ హయాంలో ఓ సంకల్పంతో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా సర్కారు స్కూళ్ల రూపురేఖలే మార్చేశారు. విద్యార్థులు వేసుకునే యూనిఫాం దగ్గర నుంచి కార్పొరేట్ స్కూళ్లకు ఏమాత్రం తీసిపోకుండా డిజిటల్ క్లాస్‌రూములు, ఇంగ్లిష్ మీడియం విద్య ప్రవేశపెట్టి ప్రభుత్వ స్కూళ్లను రోల్‌మోడల్‌గా చేశారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అదే ఒరవడిని కొనసాగించాల్సింది పోయి ఏడాది కాలంగా చోద్యం చూస్తోంది. గత ప్రభుత్వంలోనే నాడు–నేడు ద్వారా నియోజకవర్గంలోని 333 పాఠశాలలను రూ. 38.23కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ఆధునీకరించారు. తద్వారా కొన్ని పాఠశాలలకు అదనపు గదులు కూడా నిర్మించారు. అయితే కొన్నిచోట్ల పనులు జరుగుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికల కారణంగా ఆగిపోయాయి. 60 నుంచి 80శాతం మేర పూర్తయిన ఆ పనులను కూటమి సర్కారు గద్దెనెక్కగానే నిలిపివేసింది. దీంతో అసంపూర్తి భవనాలు అలానే దర్శనమిస్తున్నాయి. కోట్ల రూపాయిల ప్రజాధనం వృథా అవుతున్నా కూటమి సర్కారు ఆ పనుల గురించి ఆలోచన చేయకపోవడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. పలుచోట్ల అదనపు గదులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.





అరుదూరు స్కూల్‌లో ఆగిపోయిన అదనపు తరగతి గది, వరదయ్యపాళెం హైస్కూల్‌లో ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం







వరదయ్యపాళెం మండలం పాండూరు హైస్కూల్‌లో నిలిచిన అదనపు గదులు, బీఎన్‌కండ్రిగ మండలం పల్లమాలలో ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణ పనులు, బీఎన్‌కండ్రిగ మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఆగిపోయిన రెండంతస్తుల అదనపు గదుల నిర్మాణం

నిత్యాన్నదాన పథకానికి విరాళం



నిత్యాన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న దాతలు రంభ, రాజేష్



విరాళం అందజేస్తున్న బాలసుబ్రహ్మణ్యం దంపతులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం పలువురు భక్తులు వేర్వేరుగా విరాళాలు అందజేశారు. బెంగళూరుకు చెందిన బాలసుబ్రహ్మణ్యం దంపతులు రూ.లక్ష, సికింద్రాబాద్‌కు చెందిన రాజేష్, రంభ దంపతులు రూ.50 వేలు విరాళాలు ఇచ్చారు. ఆలయ అధికారులు ఆ విరాళాలు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి కాయల లారీ బోల్తా

కార్వేటినగరం: మామిడి కాయల లారీ బోల్తా పడిన సంఘటన మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని చిన్నకనుమ మలుపు వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వైపు మామిడి కాయల లోడుతో వస్తున్న లారీ చిన్నకనుమ మలుపు వద్ద అదుపు తప్పి పది అడుగుల పల్లంలోకి బోల్తాపడింది. దీంతో లారీలోని కాయలు చెల్లాచెదురయ్యాయి. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మార్గంలో తమిళనాడు నుంచి తిరుపతికి నిత్యం ప్రయాణికులతో బస్సులు, ఆటోల ్ రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదకరంగా ఉన్న చిన్నకనుమ మలుపు వద్ద అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అధికారులు మలుపు వద్ద సూ చిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

శ్రీకాళహస్తి తహసీల్దారుగా జనార్ధన రాజు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి తహసీల్దారుగా జనార్ధన రాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది సాదర స్వాగతం పలికి బాధ్యతలు అప్పగించారు. గతంలో ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన లక్ష్మీనారాయణ సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి కలెక్టరేట్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో చిన్నగుంతకల్లు తహసీల్దారుగా పనిచేస్తున్న జనార్ధన రాజు బాధ్యతలు తీసుకున్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

26 నుంచి పెరియాళ్వార్ ఉత్సవం

తిరుపతి అన్నమయ్యసర్కిల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయానికి అనుబంధంక శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 26 నుంచి జూలై 5వ తేదీ వరకు పెరియాళ్వార్ ఉత్సవం నిర్వహించనున్నారు. చివరి రోజు ఉదయం పెరియాళ్వార్‌కు తిరుమంజనం జరిపించనున్నారు. సాయంత్రం శ్రీగోవిందరాజస్వామి వారు గరుడ వాహనంపై, పెరియాళ్వార్ గజ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగనున్నారు.

డయేరియాపై అవగాహన



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: వర్షాకాలంలో వచ్చే డయేరియా సోకకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వారు నీర్పాకోట ఎస్టీ కాలనీలో డయేరియాపై చిన్నబిడ్డల తల్లులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వర్షకాలం వచ్చే జబ్బులు రెండు రకాలుగా ఉంటాయన్నారు. అందులో ఒకటి కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులు, రెండవది దోమల ద్వారా వచ్చే వ్యాధులు, కలుషితమైన నీరు, ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల టైఫాయిడ్, నీళ్ల విరోచనాలు అవుతాయన్నారు. దోమల వల్ల మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. వైద్య సిబ్బంది సూచనలు పాటిస్తే వ్యాధుల భారి నుంచి కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యోగాయ నమః

- శ్రీకాళహస్తి, సత్యవేడులో ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ యోగా డే
- యోగా ప్రాముఖ్యతను వివరించిన శిక్షకులు
- శ్రీసిటీలో ఆకట్టుకున్న ఆయుర్వేద వైద్యశిబిరం



శ్రీసిటీలో యోగాసనాలు వేస్తున్న పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు

శ్రీకాళహస్తి: యోగా అనేది మనిషి దినచర్యలో భాగం కావాలని.. అప్పుడే ఆరోగ్యం మెండుగా ఉంటుందని యోగా గురువు మార్కండేయులు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో శనివారం ఘనంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పట్టణవ్యాప్తంగా నిర్వహించారు. శుకబ్రహ్మాశ్రమంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యోగసనాల ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి, ఉత్తరాధికారి సర్వాత్మనందగిరిస్వామి ఈ సందర్భంగా మార్కండేయులను ఘనంగా సత్కరించారు. తొట్టంబేడు మండలం పూడి గ్రామంలో తొట్టంబేడు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీనాయుడు, మునిరామయ్య, తదితరులు యోగాసనాలు వేశారు. తొట్టంబేడు ప్రభుత్వ పాఠశాలలో యోగా డే వేడుకలు నిర్వహించారు.

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత వేడుకగా, ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్థానిక విజిటర్స్ సెంటర్ ఆవరణలో జరిగిన యోగా కార్యక్రమంలో సుమారు 270 మంది పాల్గొన్నారు. భారతదేశంలో ప్రారంభమైన పురాతన అభ్యాసన యోగాను ప్రోత్సహిస్తూ ఏటా అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నట్లు ఆయన తెలిపారు. 'ఒకే భూమి.. ఒకే ఆరోగ్యం కోసం యోగా' థీమ్‌గా ఈ ఏడాది యోగా డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యోగా గురువు, ఏపీ స్పోర్ట్స్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.కోదండం ప్రత్యేక అతిథిగా విచ్చేసి, కార్యక్రమంలో పాల్గొన్న వారికి సూర్య నమస్కారాలు, వివిధ శ్వాస వ్యాయామాల పట్ల శిక్షణ ఇవ్వడంతో పాటు యోగా వల్ల కలిగే పలు ప్రయోజనాలను వివరించారు. శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి తన సందేశంలో యోగా ప్రాచీన భారతావని మానవాళికి అందించిన అమూల్య బహుమతి అని పేర్కొన్నారు. పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు, పోలీసులు, స్థానిక పాఠశాలల విద్యార్థులు, పరిసర గ్రామాల ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. యోగా గురువు అవినాష్ కన్న ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. అనంతరం విజిటర్స్ సెంటర్ ఆవరణలో ప్రత్యేక ఆయుర్వేద శిబిరం నిర్వహించారు. శ్రీసిటీలోని తులసి ఆయుర్వేద ఆస్పత్రికి చెందిన డాక్టర్ శివప్రసాద్, వైద్య బృందం ఇందులో పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ బాలాజి నాయక్ ఆధ్వర్యంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, యువకులు, మహిళలు పెద్దఎత్తున యోగాసనాలు వేశారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని బీసీ హాస్టల్‌లో సహాయ బీసీ సంక్షేమాధికారి మునీంద్రయ్య విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి, యోగాసనాలు నేర్పించారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘుపతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్, లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటించారు.

ఐజర్‌లో..

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లి సమీపంలో ఉన్న తిరుపతి ఐజర్‌లో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఐజర్ డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య ఆధ్వర్యంలో సిబ్బంది, విద్యార్థులు యోగసనాలను సాధన చేశారు. కార్యక్రమంలో ఐజర్ రిజిస్ట్రార్ ఇంద్రప్రీత్ సింగ్ కోహ్లీ, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

రేణిగుంట: మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా లీగల్ టీం ఏర్పాటు చేసిందని విజయవాడ లీగల్ టీం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. శనివారం లీగల్ టీం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టోల్‌ఫ్రీ లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమా





ఐజర్‌లో ఆసనాలు చేస్తున్న విద్యార్థులు, శుకబ్రహ్మాశ్రమంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

యోగా చేసిన వానరం..

నాగలాపురం: పిచ్చాటూరు వెలుగు కార్యాలయంలో యోగా మాస్టర్ దొరైవేలు ఆధ్వర్యంలో మహిళలు యోగా చేస్తుండగా ఓ వానరం వచ్చి యోగా సాధన చేయడం విశేషం. సుమారు 15 నిమిషాలు పాటు వానరం యోగా చేసి వెళ్లిపోయింది.



యోగా చేస్తున్న వానరం